సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం | 5 | మే | 2025



ధాన్యం నాణ్యతగా ఉండాలి

రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ సూచించారు. - 10లో



పాటల్లో మొనగాడు

సమాజాన్ని మేల్కొలిపేలా పాటలు రాస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు మోదు బావిగూడేనికి చెందిన ప్రశాంత్. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41° /25°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఆత్మకూరు(ఎం) : భూ భారతి చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు భూ సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి.లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆత్మకూర్(ఎం) మండలాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో నేటి నుంచి 15వ తేదీ వరకు సదస్సులు జరుగుతాయన్నారు. మొదటి రోజు సర్వేపల్లి, రాయిపల్లిలో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. భూ సమస్యలున్న రైతులు నిర్దేశిత ఫారాలను నింపి రెవెన్యూ సదస్సుల్లో అందజేయాలని కోరారు. విచారణ జరిపి జూన్ 2న పరిష్కార పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రజావాణి పునరుద్ధరణ

భువనగిరిటౌన్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమాన్ని నేటినుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ హనుమంత రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ భారతి చట్టం అవగాహన సదస్సుల దృష్ట్యా ప్రజవాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందన్నారు. సదస్సులు ముగిసినందున ప్రజావాణి తిరిగి యథావిధిగా కొనసాగుతుందని, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసేందుకు రావచ్చన్నారు.

ఫాల్కే పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న ధనుంజయ్య

చౌటుప్పల్ : పట్టణానికి చెందిన సినీ నిర్మాత చిరందాసు ధనుంజయ్య ఓ స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన యూనిటీ ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్.. చిత్రానికి ఈయన నిర్మాతగా వ్యవహరించారు. ఉత్తమ నిర్మాత కేటగిరీలో పురస్కారానికి ఎంపికయ్యారు. అదే విధంగా ఉమా భవాని ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో రూపొందించి మరో లఘు చిత్రం ది అవార్డు 1996 జ్యూరీ అవార్డుకు ఎంపికైంది. దీంతో చిరందాసు ధనుంజయ్యను ది బెస్ట్ సోషల్ అవేర్‌నెస్ నిర్మాతగా ప్రకటించారు. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యాలయంలో ధనుంజయ్య అవార్డు అందుకున్నారు. అవార్డు లభించడం ఆనందంగా ఉందని, మరిన్ని చిత్రాలు నిర్మించేందుకుగాను నిచ్చెనలా పని చేస్తుందని తెలిపారు.

7 నుంచి క్రికెట్ కోచింగ్

భువనగిరి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 7వ తేదీ నుంచి నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ క్యాంప్ నిర్వహించనున్నట్లు క్యాంప్ ఇంచార్జ్ సయ్యద్ అమీనొద్దీన్ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14,16,19 విభాగాల్లో బాలబాలికలకు కోచింగ్ ఉంటుందన్నారు. రోజూ సాయంత్రం 4గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు కోసం ఫోన్ నంబర్ 83413 13449ను సంప్రదించాలని కోరారు.



ఏప్రిల్ 25న



ఏప్రిల్ 29న..



ప్రస్తుతం..

మోడువారి.. చిగురించి

భూదాన్‌పోచంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న రావిచెట్టు పది రోజుల క్రితం ఆకులన్నీ రాలి మోడువారింది. క్రమంగా చిగురించి, లేత ఆకుల నుంచి ముదురు ఆకుల పచ్చదనంతో కనువిందు చేస్తోంది.

-భూదాన్‌పోచంపల్లి

ఆరుబయటే మందు!

బహిరంగ ప్రదేశాల్లో మందుబాబుల హల్‌చల్

- పార్కులు, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాలే తాగడానికి అడ్డాలు
- పర్మిట్ రూంలు ఉన్నా వైన్స్‌ల ఎదుటే నిలబడి మద్యపానం
- అక్కడి నుంచి వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్న మహిళలు



మందుబాబులు దర్జాగా బయట నిలబడి మద్యం సేవిస్తున్న ఈ దృశ్యం భువనగిరిలోని హౌసింగ్ బోర్డు సమీపంలోనిది. వైన్స్‌లో మద్యం కొని, ఇలా పక్కనే నిల్చుని తాగుతుంటారు. ఈ వైన్స్ ఎదుట ఉన్న దారిలో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.

సాక్షి,యాదాద్రి : బహిరంగ ప్రదేశాలను తమ సిట్టింగ్‌కు అడ్డాలుగా మార్చేస్తున్నారు.. మందుబాబులు. సాయంత్రం అయితే చాలు.. పార్కులు, చెరువు కట్టలు, రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో మద్యం సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. వైన్స్‌ల వద్ద ఆరుబయటే నిలబడి తాగేస్తున్నారు. వీరి వల్ల ఆ మార్గాల్లో వెళ్లే మహిళలు, యువతులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు శాంతిభద్రతల సమస్యలూ తలెత్తుతున్నాయి. భువనగిరిలోని మద్యం దుకాణాల వద్ద ఆదివారం సాయంత్రం 'సాక్షి' విజిట్ చేయగా వాస్తవాలు వెలుగుచూశాయి.

- ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వైన్స్ వద్ద మద్యం బాబులు ఆరుబయట నిలబడి తాగుతున్నారు. కొందరు వైన్స్ వెనక ఉన్న పర్మిట్‌రూంలో కూర్చొని తాగేస్తున్నారు. పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలు రోడ్డువరకు నిలుపుతున్నారు. ఇక్కడ ఆటో స్టాండ్ ఉంది. వలిగొండ, భువనగిరి మండలంలోని పలు గ్రామాలకు ఇక్కడి నుంచి సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆటోల్లో వెళ్లడానికి వేచి ఉంటారు. ఈ క్రమంలో మద్యంబాబుల ఆగడాలతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయని చిరు వ్యాపారులు వాపోయారు.
- హైదరాబాద్ చౌరస్తా వద్ద రెండు వైన్స్‌లు ఉన్నాయి. మద్యంబాబులు మద్యం కొనుగోలు చేసి ఆరుబయటే నిలబడి తాగుతున్నారు. పక్కనే ఫంక్షన్ హాళ్లు, ఎదురుగా హౌసింగ్‌బోర్డు కాలనీ ఉంది. మహిళలు అక్కడి నుంచి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. మద్యంబాబులు ఫూట్‌గా మద్యం సేవించి ఘర్షణలకు దిగుతున్నారని స్థానికులు తెలిపారు. పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది.
- ఏరియా ఆస్పత్రి పక్కన, పాతబస్టాండ్, నల్లగొండ చౌరస్తాలోని మద్య దుకాణాల వద్ద మందుబాబులు ఆరుబయట నిలబడి, పర్మిట్ రూంలలో గంటల తరబడి కూర్చొని మద్యం సేవిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో మద్యం బాబుల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నిబంధనల ఉల్లంఘన

భువనగిరి పరిధిలో 11 మద్యం దుకాణాలు ఉన్నాయి. అన్నింటికీ పర్మిట్ రూంలు ఉన్నాయి. వీటిలో కొన్ని రూల్స్ పాటించడం లేదు. ఇక వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి నిలబడి తాగిపోవడానికి మాత్రమే ఏర్పాట్లు చేయాలి. కానీ, రూల్స్‌కు విరుద్ధంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. సోడా, కూల్‌డ్రింక్స్, నీళ్లు, కావల్సిన తినుబండారాలు సప్లై చేస్తున్నారు. దీంతో మందుబాబులు గంటల తరబడి అక్కడే సిట్టింగ్ వేస్తుండడంతో చుట్టుపక్కల నివసించే కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.

'మామూలు'గా తీసుకుంటున్న పోలీసులు

విధి నిర్వహణలో భాగంగా ఎక్సైజ్, సివిల్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో నిరంతరం గస్తీ తిరుగుతుంటారు. మందుబాబులు ఆరుబయటే మద్యం సేవిస్తున్నా మిన్నకుండ ఉండిపోతున్నారన్న విమర్శ లున్నాయి. నెలవారీ మామూలు తీసుకుంటూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెరువు కట్టపైనా తిష్ట..

రాత్రి ఎనిమిది గంటలు దాటితే చాలు.. మందుబాబులు భువనగిరి చెరువుకట్ట పొడవునా గుంపులుగా తిష్టవేస్తున్నారు. అర్ధరాత్రి వరకు మద్యం సేవించి ఎంజాయ్ చేస్తున్నారు. ఖాళీ సీసాలను కట్టపైనే వదిలి వెళ్తున్నారు. కొందరు సీసాలను పగులగొట్టి అక్కడే పడేస్తుండడంతో ఉదయం వాకింగ్‌కు వచ్చిన వారు ఇబ్బందులకు గురవుతున్నారు. పగిలిన సీసీ ముక్కలు తొక్కడంతో పలువురు ప్రమాదలకు గురయ్యారు.



భువనగిరి చెరువు కట్టపై మందుబాబులు తాగి పడేసిన ఖాళీ బీరు సీసాలు



భువనగిరిలోని నల్లగొండ రోడ్డులో వైన్స్ వద్ద ఆరుబయట నిలబడి మద్యం సేవిస్తున్న దృశ్యం

సీఐ.. ఇక ఠాణా బాస్

ఆలేరు పోలీస్‌స్టేషన్ స్థాయి పెంపు

- ఎస్‌హెచ్‌ఓగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్
- ఇక సీఐ పర్యవేక్షణలో కార్యకలాపాలు
- త్వరలో మరొక ఎస్ఐ, అదనపు సిబ్బంది నియామకం
- వేగవంతంగా కేసుల పరిశోధన




ఆలేరు: ప్రజలకు పోలీస్ సేవలు చేరువలో ఉండేలా ఆ శాఖ చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా పాలనాసౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా స్టేషన్ల స్థాయిని పెంచడంతో పాటు అదనపు సిబ్బందిని నియమిస్తోంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఆలేరు ఠాణాను అప్‌గ్రేడ్ చేసింది. ఇప్పటి వరకు ఎస్ఐ.. స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ)గా వ్యవహరిస్తుండగా.. ఇకపై సీఐ పర్యవేక్షణలో కార్యకలాపాలు కొనసాగనున్నాయి. యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండల్‌రావును ఆలేరు ఠాణా తొలి ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ రాచకొండ సీపీ ఆదేశాలు ఇచ్చారు.

పెరగనున్న సిబ్బంది

స్టేషన్ స్థాయి పెరిగిన నేపథ్యంలో అదనపు సిబ్బంది రానున్నారు. ప్రస్తుతం ఎస్ఐతో పాటు 21 మంది కానిస్టేబుల్స్, నలుగురు హెడ్‌కానిస్టేబుల్స్ ఉన్నారు. ఇప్పుడు సీఐతోపాటు అదనంగా ఎస్ఐ రానున్నారు. ప్రస్తుత ఠాణా కేటగిరీ ఏ లేదా బీకి పెంచి, అదనపు కానిస్టేబుల్స్, ఇతర సిబ్బందిని నియామకం చేయనున్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం



అప్‌గ్రేడ్ వల్ల స్టేషన్‌లో ఎక్కువ మంది పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండే అవకాశం కలుగుతుంది. విజబుల్ పోలీసింగ్ పెరగనున్నది. తద్వారా సమస్యలపై ఠాణాకు వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందనున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్స్ మెరుగుపడతాయి. నేరాలను పరిశోధించే సాక్ష్యాల సేకరణ, దర్యాప్తు పద్ధతులు మరింత సులువవుతాయి. ప్రస్తుతం ఒక సీఐ, ఒక ఎస్ఐ ఉంటారు. త్వరలోనే మరో ఎస్ఐని, ఇతర అదనపు సిబ్బందిని నియమిస్తాం. మెరుగైన సేవలు అందించాలనేది లక్ష్యం.

-సుధీర్‌బాబు, రాచకొండ సీపీ

కేజీబీవీ విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

భువనగిరి : కస్తూరిబాగాంధీ విద్యాలయాల విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించనున్నారు. సోమవారం (నేడు) క్యాంపులు ప్రారంభమై 20వ తేదీ వరకు 15 రోజుల పాటు కొనసాగనున్నాయి. జిల్లాలో 11 కేజీబీవీలు ఉండగా 75 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ భూదాన్‌పోచంపల్లిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్ ఉచితంగా అందజేయనున్నారు.ఉదయం 6నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్యాంపులు ఉంటాయి. విద్యార్థులకు ఉచిత భోజనం వసతి కల్పించనున్నారు.

ఎనిమిది అంశాలపై శిక్షణ

మ్యూజిక్, డ్యాన్స్, పేయింటింగ్, కంప్యూటర్ స్కిల్స్, స్పీడ్ మ్యాథ్స్, క్రీడలు, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్ పై శిక్షణ ఇవ్వనున్నారు. కో ఆర్డినేటర్లుగా ప్రత్యేక అధికారులను విద్యాశాఖ నియమించింది. అంతే కాకుండా బాలికల భద్రత కోసం వ్యాయామ ఉపాధ్యాయరాలు, ఏఎన్ఎం, స్కూల్ సిబ్బంది రాత్రి విధుల్లో ఉండనున్నారు. సమ్మర్ క్యాంపులో ఇచ్చే శిక్షణతో మానసికోల్లాసం కలగడంతో పాటు, నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని డీఈఓ సత్య నారాయణ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు, భారీగా తరలివచ్చిన భక్తులతో కోలాహలం నెలకొంది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలకారంమూర్తులకు నిజాభిషేకం చేసి సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖమండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయంలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సస్యశ్యామలం చేస్తాం

- అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖపై మిర్యాలగూడలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం
- హాజరైన గుత్తా, మంత్రి కోమటిరెడ్డి



తెలంగాణ రాష్ట్ర గీతం పాడుతుండగా గౌరవ సూచికంగా లేచి నిలబడిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎంపీ చామల, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, అధికారులు

మిర్యాలగూడ: ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని, దీనికి అధికారులు, ప్రజాప్రతినిధులంతా సహకరించాలని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఎస్‌పీ కన్వెన్షన్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా సాగునీటి, పౌరసరఫరాల శాఖ (వరి ధాన్యం సేకరణ, సన్న బియ్యం పంపిణీ)పై సమీక్ష నిర్వహించారు. ముందుగా తెలంగాణ గీతం ఆలపిస్తుండగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికా రులంతా గౌరవ సూచికంగా లేచి నిలబడ్డారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.94వేల కోట్లు ఖర్చు చేసిందని, ఆ నిధులతో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయవచ్చన్నారు. కృష్ణా జలాల పంపిణీ విషయంలోనూ గత ప్రభుత్వం ట్రిబ్యునల్‌తో ఒప్పందం చేసుకుందని, సాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న 811 టీఎంసీల నీటిని 512 టీఎంసీలు ఏపీకి, 298 టీఎంసీలు తెలంగాణకు కేటాయించేలా గత ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఒప్పందం చేసుకుందని చెప్పారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయకుండా బ్రిజేష్ ట్రిబ్యునల్ రీఓపెన్ చేసి పునఃపరిశీలన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం గట్టిగా వాదిస్తోందని తెలిపారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను తామే పూర్తి చేస్తామని, నిర్లక్ష్యానికి గురైన డిండి ప్రాజెక్టుకుగాను రూ.1,800 కోట్లు కేటాయించామన్నారు. ఈ యాసంగిలో కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం పథకం తెచ్చామన్నారు.

సాగునీటి పనుల పురోగతిపై మంత్రి అసంతృప్తి

సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో సాగునీటి పనుల పురోగతిపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో భారీ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, బాలునాయక్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్‌నందలాల్, భూసేకరణ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్‌కృష్ణారెడ్డి, నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, అడిషనల్ డీజీపీ చౌహాన్, తెలంగాణ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ శ్రీనివాస్‌రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మాది పేదల ప్రభుత్వం

– ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రజా ప్రభుత్వమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అన్నింటి కంటే సన్న బియ్యం పంపిణీ పథకం తమకు నచ్చిందన్నారు. పదేళ్ల పాటు ఫాంహౌస్‌లో పడుకున్న కేసీఆర్ కాంగ్రెస్‌ను విలన్‌గా చూపించడం అతని అసహనానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి రూ. 150 కోట్లు కేటాయించామన్నారు. జూన్‌లో టెండర్లు పిలిచి జూలైలో పనులు ప్రారంభిస్తామన్నారు.

మరమ్మతులకు నిధులివ్వాలి

–శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ సాగర్ ఎడమకాల్వ మరమ్మతుకు నిధులు కేటాయించాలని అన్నారు. ఎస్ఎల్‌బీసీ మెయిన్ కెనాల్‌కు రూ.440కోట్లు మంజూరు చేశారని, మరో 3, 4 కిలోమీటర్లు ప్రధాన కాల్వ లైనింగ్ పెంచితే 2లక్షల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఏపీ నుంచి నల్లగొండకు అక్రమంగా వస్తున్న ధాన్యం రవాణాలను అరికట్టాలని అధికారులకు సూచించారు.

రైతుల ముంగిటకు శాస్త్రవేత్తలు

- పంటల సాగు విధానాలపై అవగాహన
- నేటి నుంచి జూన్ 13 వరకు సదస్సులు
- కార్యాచరణ సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ



త్రిపురారం : పంటల సాగులో అవలంబించాల్సిన విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతుల ముంగిటకు వ్యవసాయ శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నాయి. జిల్లాలో సోమవారం నుంచి జూన్ 13వ తేదీ వరకు గ్రామాల్లో సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించనున్నారు.

వీటిపై అవగాహన : భూసార పరీక్షలు, ఎరువులు, యూరియా వాడకాన్ని తగ్గించుకోవడం, చీడపీడల నివారణ మార్గాలు, విత్తనాభివృద్ధి, నీటి యాజమాన్య పద్ధతులు, సమీకృత, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, యాంత్రీకరణ, వ్యవసాయ శాఖ పథకాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు వివరిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్ : రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన సంస్థ సంచాలకుడు గాదె శ్రీనివాస్, చౌటుప్పల్ మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.చౌటుప్పల్ డివిజన్ పరిధిలోని చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్ పోచంపల్లి మండలాల్లోని 42 గ్రామాల్లో నేటినుంచి ఈనెల 13వ తేదీ వరకు సదస్సులు ఉంటాయన్నారు.రైతు వేదికలు, పంచాయతీ కార్యాలయాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చౌటుప్పల్ మండలంలో ఇలా..

5న దండుమల్కాపురం, 8న చిన్నకొండూర్, 13న పెద్దకొండూర్, 16న తంగడపల్లి, 20న డి.నాగారం, 22న జైకేసారం, 24న మసీదుగూడెం, 29న ఎస్.లింగోటం, 30న ఎల్లగిరి, జూన్ 3న మందోళ్లగూడెం, 5న పంతంగి, 10న చౌటుప్పల్, 12న లింగోజిగూడెంలో సదస్సులు ఉంటాయి.

సదస్సులతో రైతులకు మేలు



సోమవారం నుంచి జూన్ 13 వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలను రైతులు సద్వినియెగం చేసుకోవాలి. అవగాహన కార్యక్రమాలతో రైతులకు మేలు జరుగుతుంది.

-పాల్వాయి శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

భూ పరిరక్షణ చర్యలు చేపట్టాలి



భూ పరిరక్షణ చర్యలు చేపట్టడం చాలా ముఖ్యం, రైతులు విత్తనాన్ని అభివృద్ధి చేసుకోవాలి. సాగులో సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి. యాంత్రీకణను సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలి.

- డాక్టర్ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కేవీకే, కంపాసాగర్

తాటిపాములను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : మంత్రి ఉత్తమ్

తిరుమలగిరి (తుంగతుర్తి): తన స్వగ్రామం తాటిపాములను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో రూ.16 కోట్లతో బ్రిడ్జి, రూ.7.14 కోట్లతో చెక్ డ్యామ్, రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. 600 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగాఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా చెన్నూరు రిజర్వాయర్ నుంచి నీరందిస్తామని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం మొదటి స్థానంలో నిలవగా.. రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ మంత్రిని కోరారు. సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్థిక సంఘం సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

ఒకే కంటెయినర్‌లో 101 పశువుల తరలింపు

- డ్రైవర్‌పై కేసు నమోదు

కోదాడరూరల్ : కంటెయినర్‌లో అక్రమంగా తరలిస్తున్న 101 పశువులను ఆదివారం తెల్లవారుజామున కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని హనుమాన్‌జంక్షన్ సంత నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు ఒకే కంటెయినర్‌లో 76 ఎద్దులు, 25 ఆవులను అక్రమంగా తరలిస్తున్నారు. కోదాడ రూరల్ పోలీసులు అంతర్ రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్‌రోడ్‌లో కంటెయినర్‌ను తనిఖీ చేయగా.. పశువులు పట్టుబడ్డాయి. పట్టుబడిన పశువులను గోశాలకు తరలించి డ్రైవర్ ఎర్రవల్ల సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

గుర్రంపోడు: అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం చేపూరు గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చేపూరు గ్రామానికి చెందిన నక్కనబోయిన సత్తయ్య(52) ఐదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. దిగుబడి లేక పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయాడు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురై ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేలా ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో మంచిర్యాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరానికి జిల్లాలోని న్యాయవాదులు హాజరై జయప్రదం చేయాలని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్, ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్, ప్లీడింగ్ అండ్ డ్రాఫ్టింగ్స్, నూతన చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు.

స్వర్ణగిరీశుడికి సహస్రనామార్చన సేవ



సహస్రనామార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామికి ఆదివారం సహస్రనామార్చన సేవ నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పల్లెటూరి పిల్లగాడు.. పాటల్లో మొనగాడు



దేశభక్తిపై వీడియో రూపొందిస్తున్న ప్రశాంత్



హైకోర్టు జడ్జి చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రశాంత్ (ఫైల్)

- సమాజాన్ని మేల్కొలిపేలా పాటలు రాసి, వీడియోలు రూపొందిస్తున్న ప్రశాంత్
- మంత్రి సీతక్క, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోకతేజచే ప్రశంసలు

ఆత్మకూరు(ఎం): మారుమూల పల్లెటూరిలో పుట్టి పాటలపై తనకున్న ఆసక్తితో సమాజాన్ని మేల్కొలిపేలా పాటలు రూపొందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు ఆత్మకూరు(ఎం) మండలం మోదుబావిగూడేనికి చెందిన చంద్రగిరి ప్రశాంత్. ప్రశాంత్ స్వయంగా పాటలు రాసి వాటిని పాడుతూ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ పలువురిని ఆకట్టుకుంటున్నాయి. మోదుబావిగూడేనికి చెందిన వసంత, రాజారామ్ దంపతుల కుమారుడు ప్రశాంత్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం ప్రశాంత్ కప్రాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పదో తరగతి చదువుతున్న రోజుల్లో స్కూల్‌లో పాటల పోటీలు నిర్వహించగా.. తన తల్లి వసంత తోటి కూలీలతో కలిసి పొలంలో పాడిన పాట గుర్తొచ్చి దానిని ప్రశాంత్ పాడి వినిపించాడు. గొంతు చాలా చక్కగా ఉండటంతో ఉపాధ్యాయులు ప్రశాంత్‌ను అభినందించారు. అప్పటి నుంచి తానే స్వయంగా పాటలు రాసి, సీడీలు చేయాలని ప్రశాంత్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. ప్రతి పాట సీడీ చేయాలంటే సుమారు రూ.20వేల వరకు ఖర్చయ్యేదని, తన జీతంతో పాటు తల్లిదండ్రులు ఆర్థికంగా సాయం అందించేవారని ప్రశాంత్ చెబుతున్నాడు. తమ కుమారుడు మంచి రచయితగా, మంచి గాయకుడుగా అందరు గర్వించే విధంగా ఎదగాలని ప్రశాంత్ తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



పాట పాడుతున్న చంద్రగిరి ప్రశాంత్

ప్రశంసలు అందుకున్న ప్రశాంత్..

తెలంగాణ ఉద్యమంలో 'అమ్మ తెలంగాణ.. మరో తెలంగాణ.. అమరవీరులే... అంటూ పాట రాసి స్వయంగా పాడాడు. కరోనా సమయంలో మంత్రి సీతక్క చేపట్టిన సేవలపై 'మలినం లేని మట్టిమనిషి' అంటూ వీడియో చేసి మంత్రి సీతక్క చేతుల మీదుగా అవిష్కరింపజేశాడు. ఇటీవల కశ్మీర్ పహల్గాం వద్ద ఉగ్రదాడిని నిరసిస్తూ 'భరతమాత శిరస్సుపై సరిహద్దు కంచె తెంపి దూసుకొచ్చె సంగ్రామం' అంటూ ఇటీవల దేశభక్తి వీడియో రూపొందించి ప్రముఖ కవి డి. అరవిందరాయుడు చేతుల మీదుగా విడుదల చేశాడు. గ్రామ పంచాయతీ కార్మికులపై కూడా వీడియోలు రూపొందించాడు. సమాజాన్ని మేల్కొలిపే విధంగా పాటల రచన చేస్తున్న ప్రశాంత్ ఇటీవల హైకోర్టు జడ్జి చంద్రశేఖర్ చేతుల మీదుగా బెస్ట్ లిరిసిస్ట్ అవార్డు సైతం అందుకున్నాడు. ప్రశాంత్ కృషిని మంత్రి సీతక్క, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ సైతం అభినందించారు. తనకు అవకాశం కల్పిస్తే సినిమా రంగంలో పాటలు రచన చేసి పాడగలని, అవకాశం కోసం ఎదురుచూస్తున్నానని ప్రశాంత్ అంటున్నాడు.



మలినం లేని మట్టికథ సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క (ఫైల్)

రాజ్యాంగబద్ధ నిర్ణయాలను స్వాగతిస్తాం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుజూర్‌నగర్: భారత ప్రభుత్వం తీసుకునే రాజ్యాంగబద్ధ నిర్ణయాలను స్వాగతిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కశ్మీర్‌లో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తుపాకుల ద్వారానే చరిత్ర మారుతుందనే సిద్ధాంతానికి తాము వ్యతిరేకమని, క్లిష్టమైన సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని సీపీఐ నమ్ముతుందన్నారు. కర్రి గుట్టల్లో కూంబింగ్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరిపి ఎన్‌కౌంటర్లను నివారించాలని కోరారు. మావోయిస్టులు కూడా చట్టపరంగా ఉద్యమాలు చేసి ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, ఎన్నికల హామీలను సక్రమంగా అములు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య, ప్రధాన కార్యదర్శి అజయ్‌నాయక్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డ వెంకటయ్య, సూర్యనారాయణ, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నాణ్యతగా ఉండేలా చూసుకోవాలి

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్



బాలాజీనగర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఎస్ చౌహాన్

కోదాడరూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించే ధాన్యం నిబంధనల ప్రకారం నాణ్యతగా ఉండేలా చూసుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో కోదాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌తో కలిసి ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యంలో తాలు, గడ్డి లేకుండా తేమ శాతం 17 ఉండేలా చూసుకొని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే వెంటనే కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని రైతులకు ఇబ్బంది లేకుండా వారం రోజుల లోపే కాంటాలు వేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకురాగానే వారికి సీరియల్ నంబర్లు ఇవ్వాలని ఆ ప్రకారం కాంటా వేయాలని ఆదేశించారు. సరిపడా గన్నీ బ్యాగులు వస్తున్నాయా లేదా లారీల సమస్య, హమాలీల కొరత ఏమైనా ఉందా అని కొనుగోలు కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 5000 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించామని, మరో 1500 క్వింటాళ్లు ఉంటాయని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఆయనకు చెప్పారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ధాన్యం రాశులను చూసి వాటి తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. రికార్డులను సైతం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో గోపతి శ్రీనివాస్ అనే రైతు ధాన్యం తేమ శాతం పరిశీలించి నాణ్యత బాగుందని ఆ రైతుకు బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ సూర్యనారాయణ, డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, డీజీఓ పద్మ, ఏపీడీ సురేష్, తహసీల్దార్ వాజిద్‌అలీ, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, డీటీసీఎస్ రాంరెడ్డి, కమతం వెంకటయ్య, అనూష ఉన్నారు.

ముమ్మరంగా సుందరీకరణ పనులు



టూరిజం పార్కులో విద్యుద్దీపాలను రిపేర్ చేస్తున్న సిబ్బంది

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లికి ఈ నెల 15న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులు రానున్న నేపథ్యంలో స్థానిక టూరిజం పార్కులో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే పార్కులోని గదులు, హాల్, మ్యూజియంలో రంగులువేసి సుందరీకరిస్తున్నారు. అలాగే పార్కు ప్రాంగణాన్ని పచ్చని లాన్‌తో తీర్చిదిద్దుతున్నారు. అందాల భామల బృందం సాయంత్రం 6 గంటలకు వచ్చి నుంచి రాత్రి 8.30 గంటలవరకు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు. దీంతో టూరిజం ప్రాంగణంలో గల విద్యుద్దీపాలన్నింటినీ రిపేర్ చేస్తున్నారు. మరో 10 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో పనులను వేగవంతం చేశారు.

ఉరేసుకుని నవ వధువు ఆత్మహత్య



హసీనా (ఫైల్)

హుజూర్‌నగర్: ఉరేసుకుని నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన షేక్ ఖాసింబీ తన కుమార్తె షేక్ మహబూబీ అలియాస్ హసీనా(19)ని గత నెల 30వ తేదీన చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన షేక్ యూసుఫ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కాగా హసీనా తన భర్త యూసుఫ్‌తో కలిసి శనివారం తన తల్లిగారింటికి వచ్చింది. ఆదివారం ఉదయం బాత్‌రూంలో స్నానం చేయడానికి వెళ్లిన హసీనా అందులో ఉన్న ఇనుప కడ్డీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హసీనా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతురాలి తల్లి ఖాసింబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నూతన్‌కల్ జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులను సన్మానించిన దృశ్యం

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని నూతన్‌కల్ జడ్పీ హెచ్‌ఎస్ పూర్వ విద్యార్థి డాక్టర్ మర్రి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొండాపూర్‌లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ క్లబ్‌లో సూర్యాపేట జిల్లా నూతనకల్ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులైన చురుకంటి పవన్‌రెడ్డి, చురుకంటి అశోక్‌రెడ్డి, చురుకంటి శ్యామ్‌సుందర్‌రెడ్డిలు టీజీ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ మెంబర్ ఆర్.రామ్మోహన్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజమల్లును సన్మానించారు.

వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బాలకృష్ణ

నాగారం : వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన ఆలకుంట్ల బాలకృష్ణ ఎంపికయ్యారు. ఆదివారం తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జరిపేట జైపాల్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆలకుంట్ల ఉపేంద్ర, జనరల్ సెక్రటరీ రూపానిరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జి శివరాత్రి గోపి, కార్యదర్శి బండారి రాజు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఈదుల రమేష్‌చంద్ర, ఆలకుంట్ల వెంకన్న, ఆలకుంట్ల మల్లయ్య, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాలకృష్ణను అభినందిస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జరిపేట జైపాల్

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

కొండమల్లేపల్లి: వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట్ల గ్రామ పరిధిలోని ఓ వ్యవసాయ బావి వద్దకు ఆదివారం ఆటోలో ఐదుగురు వ్యక్తులు వచ్చారు. ఇద్దరు ఆటోలో కూర్చోగా.. మిగతా వారు బావిలోకి దిగారు. తిరిగి వెళ్లేటప్పుడు ఆటోలో నలుగురు మాత్రమే వెళ్లారు. ఇదంతా వ్యవసాయ బావి వద్ద పనిచేసే ఓ రైతు గమనించి బావి దగ్గరకి వెళ్లి చూడగా.. జత దుస్తులు, చెప్పులు ఉండటం గమనించాడు. ఇంతలో చుట్టుపక్కల వారు బావి వద్దకు చేరుకుని డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వ్యవసాయ బావి వద్దకు చేరుకొని దేవరకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచార ఇవ్వగా వారు వ్యవసాయ బావి వద్దకు చేరుకొని బావిలో గాలించగా.. వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బయటకు తీసి దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 36 నుంచి 38 ఏళ్ల మధ్య ఉంటుందని, మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అనిశెట్టి దుప్పలపల్లిలో..

తిప్పర్తి: తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలోని భారత్ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉంటుందని, శరీరంపై ఎటువంటి గాయాలు లేవని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712670181 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

అభినయ శ్రీనివాస్‌కు గద్దర్ ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అభినయ శ్రీనివాస్

మోత్కూరు: 'ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా' వంటి ఉద్యమ గీతాన్ని రాసి మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన మోత్కూరు వాసి అభినయ శ్రీనివాస్‌కు గద్దర్ ఐకాన్–2025 అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ ప్రాంగణంలోని భాస్కర్ ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన సాయి అలేఖ్య ఫౌండేషన్ వారి 32వ వార్షికోత్సవ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతులమీదుగా అభినయ శ్రీనివాస్‌కు ఈ అవార్డును నిర్వాహకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు పట్నం మహేందర్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, అవార్డుల కమిటీ అధ్యక్షురాలు అలేఖ్య, తెలంగాణ రచయితలు, గాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామలింగాలగూడెంలో ఆదిమానవుని ఆనవాళ్లు

- పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి



దేవునిగుట్టపై రాతియుగం నాటి బండరాయిని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

ఫ్లాష్‌టవర్ (నల్లగొండ), తిప్పర్తి: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం రామలింగాలగూడెంలోని దేవుని గుట్టపై రాతియుగపు కాలం నాటి ఆదిమానవుడి ఆనవాళ్లు ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వెల్లడించారు. మరుగునపడిన వారసత్వ చిహ్నాలను గుర్తించి, వాటి ప్రాముఖ్యతను స్థానికులకు తెలియజేసే 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ' అనే అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన రామలింగాలగూడెంలోని శివాలయం పక్కనే ఉన్న దేవుని గుట్టపై ఆదివారం జరిపిన పరిశీలనలో పాల్గొని మాట్లాడారు. మూడు బండలపైన కొత్త రాతియుగపు మానవులు, తాము నిత్యము వాడుకునే రాతి పనిముట్లతో ఎద్దులు, దుప్పులు, జింకలు, కుక్కలు, పులి ఇంకా ఆనాటి మానవులు వేటాడే దృశ్యాల బొమ్మల్ని తీర్చిదిద్దారన్నారు. ఈ రాతికళ క్రీ.పూ. 6000– 4000 సంవత్సరాల మధ్య కాలానికి చెందినదని ఆయన చెప్పారు. గుట్టపై సహజంగా ఏర్పడిన నీటిదోనెలు, రాతి గొడ్డళ్లను అరగ తీసుకున్న ఆనవాళ్లు కూడా ఉన్నాయన్నారు. గుట్టపై సహజంగా ఏర్పడిన పెద్ద పెద్ద బండల మాటున గల గుహల్లోనూ, పాము పడగ ఆకారంలో గల రాతి చరియల కింద నివసిస్తూ, తీరిక సమయాల్లో తాము పాల్గొన్న సంఘటనలను, చూసిన దృశ్యాలను చిత్రించారని శివనాగిరెడ్డి తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత గల ఈ పురాతన రాతికళను కాపాడి, భవిష్యత్ తరాలకు తెలియజేయాలని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిల్పి వెంకటేష్, మోతీలాల్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

తాళ్లగడ్డ (సూర్యాపేట): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ పార్థసారధి తెలిపారు. ఆదివారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సూర్యాపేట రూరల్ ఎస్‌ఐ బాలునాయక్ శనివారం పోలీస్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా.. బాలెంల శివారులోని మున్సిపాలిటీ డంపిగ్ యార్డు ఎదురుగా భాషనాయక్ తండాకు చెందిన అక్కినపల్లి సాయికిరణ్, సూర్యాపేట పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన కలిముత్తు శ్రీకాంత్ అలియాస్ సాయి అనుమానస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పట్టుకుని విచారించగా.. ఒడిశా రాష్ట్రం నుంచి కేజీ గంజాయి రూ.4వేలకు కొనుగోలు చేసి సూర్యాపేటలకు తీసుకొచ్చి రూ.10వేలకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ బాలునాయక్ పాల్గొన్నారు.

నీట్ నిబంధనలు

దేశ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థులకు కఠినమైన నిబంధనలు పెట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లోని పలు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు పెట్టుకొచ్చిన బెల్టులు, చెవి దిద్దులు, కాళ్ల పట్టీలను పరీక్షా కేంద్రం నిర్వాహకులు తొలగింపజేశారు.



నీట్ పరీక్ష సందర్భంగా నల్లగొండలోని ఎన్జీ కాలేజీ సెంటర్ వద్ద తన కుమార్తెకు అన్నం తినిపిస్తున్న తల్లి




పరీక్ష కేంద్రం వద్ద కుమార్తె చెవి దిద్దులు తీస్తున్న తండ్రి



హాఫ్ షర్ట్ వేసుకోవాలనే నిబంధనతో పరీక్ష కేంద్రం వద్దే తన షర్ట్‌ను కుమారుడికి ఇస్తున్న తండ్రి



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ వద్ద విద్యార్థిని చెవి దిద్దులు తీస్తున్న పోలీస్ సిబ్బంది



విద్యార్థి మెడలో ఉన్న తాడును తొలగిస్తున్న పోలీసులు



ఆలస్యంగా వచ్చిన విద్యార్థిని బైక్‌పై తీసుకొస్తున్న ట్రాఫిక్ పోలీస్



బెల్టు తొలగించాలని విద్యార్థిని ఆదేశిస్తున్న పోలీసు సిబ్బంది